# అనర్హులకు అందలం

## లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు, భూస్వాములు, ఉద్యోగులా..!

- ఆందోళనల మధ్య మూడో రోజు గ్రామసభలు
- పోలీసుల పహారా మధ్య నిర్వహణ
- ముందస్తుగా పలువురి అరెస్టు
- ఎక్కడికక్కడ గ్రామసభలను అడ్డుకున్న ప్రజలు..
- అవకతవకలు జరిగాయంటూ అధికారుల నిలదీత



ఇబ్రహీంపట్నంరూరల్ : ఎలిమినేడు గ్రామసభలో ప్రజల కంటే పోలీసుల బలగాల ఎక్కువ..

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 23 : గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులతో పాటు పలు రకాల పథకాలపై నిర్వహిస్తున్న గ్రామసభలు మండలవ్యాప్తంగా



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తున్న భూ నిర్వాసితులు

మూడో రోజు గురువారం ఆందోళనల మధ్య కొనసాగాయి. మండల పరిధిలోని ఎలిమినేడు, రాయపోల్, నెర్రపల్లి గ్రామాల్లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చకుండా మరోసారి అప్లికేషన్లు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరిస్తామని గ్రామసభలు పెట్టడం సిగ్గుచేటని నాయకులు ప్రజలు పేర్కొన్నారు. రాయపోల్‌లో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గ్రామసభను అడ్డుకున్నారు.

### భూనిర్వాసితుల ఆందోళన

ఎలిమినేడు గ్రామంలో గురువారం పోలీసుల పహారా మధ్య గ్రామసభ జరిగింది. గ్రామసభను అడ్డుకుంటారన్న ముందస్తు సమాచారంతో పోలీసులు పలువురు గ్రామస్తులను ముందుగానే అరెస్టు చేశారు. మరి కొంతమందిని ఉదయం నుంచి హౌస్ అరెస్టు చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు నేతృత్వంలో పలువురు సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ముందుగానే గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయినప్పటికీ గ్రామసభను అడ్డుకుంటారన్న సమాచారం రావడంతో ఉదయం నుంచే పలువురు రైతులను హౌస్ అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో ఇటీవల ప్రభుత్వం పలు కంపెనీల కోసం భూసేకరణ జరిపింది. భూసేకరణ సందర్భంగా తమకు పరిహారాన్ని పెంచుతామని, అలాగే, భూములు కోల్పోయిన వారందరికీ ఇండ్లస్థలాలిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. హామీలను నెరవేర్చిన తర్వాతే గ్రామసభలు నిర్వహించాలని, ఒక్కరోజు ముందునుంచే గ్రామస్తులంతా చర్చించుకుని సభలో అధికారుల నుంచి నిజాలు రాబట్టాలని ఆందోళన చేశారు.

ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రైతుల ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, రవి, గణేశ్, బుగ్గరాములు, రాంరెడ్డి, చంటి, నర్సింహ, వెంకటేశ్‌లను ముందస్తు అరెస్టు చేశారు. గ్రామసభకు ప్రజలకంటే పోలీసులే అధికంగా హాజరయ్యారు. దీంతో గ్రామస్తులు గ్రామసభలో తమ సమస్యలను వివరించడానికి భయపడ్డారు. అర్హుల జాబితాలో తమ పేర్లు రాలేదని, పలువురు అధికారులను నిలదీస్తుండటంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి పంపించేశారు. గ్రామసభ పూర్తయ్యే వరకు ఏపీఎస్పీ పోలీసుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ మోహరించారు. గ్రామసభ పూర్తయ్యే వరకు ఆద్యంతం ఉత్కంఠగా సాగింది.



నల్లవెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

### తిరగబడ్డ నల్లవెల్లి గ్రామస్తులు

**యాచారం** : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామంలో అధికారులు ప్రదర్శించిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో గ్రామస్తులు అధికారులపై ఒక్కసారిగా తిరుగుబాటు చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికి తమ పేర్లు ఎందుకు లేవని అధికారులను నిలదీశారు. ఇంతలోనే కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురు చెప్పడంతో బీఆర్ఎస్ నాయకులు ఓరుగంటి యాదయ్యగౌడ్, కాసాని రవిగౌడ్, గండికోట యాదయ్య, పాలకూర్ల లక్ష్మీపతిగౌడ్, జిల్లా రాములు, కిషన్ తదితరులు గ్రామస్తులకు మద్దతుగా అధికారులు, కాంగ్రెస్ నాయకులతో వాగ్వావాదానికి దిగారు. మాటామాట పెరగడంతో ఒక్కసారిగా గ్రామసభలో గందరగోళం నెలకొన్నది. అనర్హులు, కాంగ్రెస్ నాయకులు, భూస్వాములు, ఉద్యోగులకు ఇండ్లు, రేషన్‌కార్డులు, ఆత్మయ భరోసా సంక్షేమ పథకాలు ఎలా వస్తాయంటూ ప్రత్యేకాధికారి శ్రీలతను నిలదీశారు. అర్హులకు మొండిచేయి చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను మోసం చేస్తున్నదని, ఇదేనా ప్రజాపాలన అంటే అంటూ ధ్వజమెత్తారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ప్రభుత్వం గ్రామ సభల పేరుతో గారడీ చేస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఎద్దేవా చేశారు. గ్రామ సభలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని వారు స్పష్టం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు అంతా గమనిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాల ప్రజలను పక్కకు తోశారు. నాయకులను ఒప్పించి పరిస్థితిని అదుపు చేశారు. మండలంలో తక్కళ్లపల్లితండా, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, మాల్, తమ్మలోనిగూడ గ్రామాల్లో గ్రామ సభలను ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల అధ్యక్షతన నిర్వహించారు. సంక్షేమ పథకాల జాబితాలో పేర్లురాని ప్రజలు ఆందోళన వ్యక్తం చేయగా.. తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించి దరఖాస్తులు స్వీకరించారు.

### గ్రామ సభకు రాజకీయ రంగు

**మొయినాబాద్** : మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో గ్రామ సభ రసాభాసగా మారింది. రైతులు వ్యవసాయం చేస్తున్న భూములను నాన్ అగ్రికల్చర్‌గా రాయడంతో రైతులు వ్యవసాయ అధికారులను నిలదీశారు. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఓ వ్యవసాయ క్షేత్రంలో కూర్చుని సర్వేలు చేసి రైతులకు రైతు భరోసా కట్ చేసే కుట్రలు చేస్తారా అని అధికారులపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అంతలోనే ఏమైనా సమస్యలుంటే చెప్పాలని ఓ కాంగ్రెస్ సీనియర్ నేత మాట్లాడుతుండగా.. సందేహాలను నివృత్తి చేయాల్సింది అధికారులా.. కాంగ్రెస్ నేతనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు సభా రసాభసగా మారింది. గ్రామ సభ రాజకీయ రంగు పులుముకోవడంతో అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొన్నది. సభా పక్కదారి పట్టే అవకాశం ఉందని భావించిన ఎంపీడీవో సంధ్య.. రైతు భరోసాకు సంబంధించి ఏదైనా తప్పులు జరిగితే తిరిగి దరఖాస్తు చేసుకుంటే సరిచేయడం జరుగుతుందని, 10 రోజుల సమయం ఉందని సముదాయించడంతో సభ శాంతించింది.



చిలుకూరులో కాంగ్రెస్ నేత సభలో మాట్లాడుతుండగా అతడిపై తిరగబడ్డ జనం

# నాణ్యమైన వైద్య సేవలందించాలి

## భారత ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ అనురాధ మెడోస్



కలెక్టర్‌ను కలిసిన సీనియర్ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ అనురాధ మెడోస్

వికారాబాద్, జనవరి 23 : వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలను గురువారం భారత ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ అనురాధ మెడోస్ జిల్లా వైద్యాధికారి వెంకట రమణతో కలిసి సందర్శించారు. వైద్య విద్యార్థులకు వైద్య విద్యతోపాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేలా, ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి కూడా వివరించాలని సూచించారు. అనంతరం పాలిటివ్ కేర్ విభాగాన్ని సందర్శించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ అవసాన దశలో ఉన్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం మహావీర్ వైద్య కళాశాలను సందర్శించి కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్‌లతో వైద్య కళాశాలలో అందిస్తున్న సేవల గురించి, ఆస్పత్రిలో నిర్ధారించే టీబీ కేసులకు ఉచితంగా టీబీ మందులను అందించాలన్నారు. లెప్రసీ కేసులను నిర్ధారిస్తే కేసు చుట్టూ ఉండే 50 ఇండ్లలో సర్వేయలెన్స్ నిర్వహించాలని, ఆస్పత్రిలో జరిగే ప్రసవాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. శిశువులకు బర్త్ డోస్ వ్యాక్సిన్‌లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి నెలవారీగా ఇండెంట్ పెట్టుకుని తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన కండోమ్, నోటి మాత్రలు లాంటివి ఉచితంగా అందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎప్పటికప్పుడు వచ్చే మార్గదర్శకాలను ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలతో పంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్లతో కలిసి మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. మూడు రోజుల పర్యవేక్షణలో జిల్లాలో పరిశీలించిన వివిధ అంశాలను, అధికారులకు, సిబ్బందికి సూచించిన వివిధ అంశాలపై కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, వైద్యాధికారులున్నారు.

# దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలి

## ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి



దుద్యాల మండల హకీంపేట గ్రామ సభలో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

కొడంగల్, జనవరి 23 : గత మూడు రోజులుగా ప్రజా పాలన గ్రామసభలు అధికారుల నిలదీతల నడుమ కొనసాగుతున్నాయి. గురువారం నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండల పరిధిలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల, దుద్యాల మండలంలోని హకీంపేట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి అందుతాయని, ప్రస్తుత జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు. గ్రామ సభలను ప్రశాంతంగా నిర్వహించుకున్నప్పుడే ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరే అవకాశం ఉన్నది. ఏఏ పథకాలు అందుకోవచ్చు, పథకాలు అందనివారు ఏవిధంగా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలనే విషయాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు విజయ్‌కుమార్, కిషన్, కోస్గీ ఎంపీడీవో శ్రీధర్, ఏడీఏ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీదేవి

# దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే..

## రంగారెడ్డిజిల్లా కోర్టు సెక్రటరీ శ్రీదేవి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 23 : నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలని.. నేర రహిత, డ్రగ్స్ రహిత, దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని రంగారెడ్డిజిల్లా కోర్టు సెక్రటరీ శ్రీదేవి అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు ఉందని, దాన్ని కాపాడే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యా వ్యవస్థ కూడా వేగవంతంగా అభివృద్ధి చెందాలంటే సమూలమైన మార్పులు తీసుకురావాలని ప్రభుత్వాలు సంక్షేమ, వసతి గృహాల్లో నిర్బంధ ప్రాథమిక వ్యవస్థను అమలు చేయడం జరిగిందని చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జ్యోతిబాపూలే హాస్టల్ ఉపాధ్యాయులున్నారు.

# పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23 : ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

# వివిధ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23 : ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

# ఎమ్మెస్సీ ఐఎస్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23 : ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ ఐఎస్ కోర్సు బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

# ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23 : ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 29లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

# జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం


ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23 : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథాలజీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# పీజీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23 : ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 28లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 3 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

# ఆదిబట్ల నుంచే అభివృద్ధికి పునాది

- రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



ఆదిబట్ల నుంచి మంగల్‌పల్లి వరకు రోడ్డు పనులకు శంకుస్థాపనలో మంత్రి, ఎమ్మెల్యే

ఆదిబట్ల, జనవరి 23 : ఆదిబట్ల నుంచే తాను అభివృద్ధికి శ్రీకారం చుట్టానని.. ఈ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడ, బొంగుళూరు, ఆదిబట్ల గ్రామాల్లో రూ.3కోట్ల60లక్షల నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం, 25 కోట్ల నిధులతో ఆదిబట్ల నుంచి మంగల్‌పల్లి వరకు బీటీ రోడ్డుకు 28కోట్ల60లక్షల రూపాయల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శిలాఫలకం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ మన్నెగూడ నుంచి టీసీఎస్, నాదర్‌గుల్ మీదుగా ఓవైసీ వరకు నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. విజయవాడ హైవే పెద్దఅంబర్‌పేట, కొహెడ మీదుగా నాగార్జున సాగర్ హైవే వరకు నాలుగు లైన్ల రోడ్డు, 2000 కోట్ల రూపాయలతో కొహెడ మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా, సాగర్ రింగు రోడ్డు నుంచి మాల్ వరకు ఆరు లైన్ల రోడ్డు, మాల్ నుంచి నాగార్జునసాగర్ వరకు నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. నియోజకవర్గంలోని పెద్దఅంబర్‌పేట్, ఇబ్రహీంపట్నంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో ఉన్న నిధులకు వెంటనే తీర్మానాలు ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీపరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రోడ్ల అభివృద్ధి చైర్మన్ రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఎన్సీ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, అధికారులు, నాయకులున్నారు.

# కబ్జా చేసి.. నిర్మాణాలు చేపట్టి..

- గతంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడిన గత కమిషనర్
- బోర్డులు పాతకపోవడంతో మరోమారు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వైనం



కబ్జా చేయక ముందు తన స్థలంలోనే ప్రహరీని ఏర్పాటు చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి

ఆదిబట్ల, జనవరి 23 : ఆదిబట్లలో భూముల రేట్లు కోట్లకు పడగలెత్తడంతో కొంతమంది కబ్జారాయుళ్లు ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేస్తున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి సర్వే నం.11లో గల ఇందిరమ్మనగర్ కాలనీలో కొంతమంది కబ్జా రాయుళ్లు రెచ్చిపోతున్నారు. కాలనీవాసుల అవసరాల నిమిత్తం 150 గజాల స్థలాన్ని కేటాయించారు. గతంలో ఆ స్థలంలో తాగు నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి కాలనీవాసులకు మంచినీరు అందించారు. ప్రభు త్వం ఆ కాలనీకి కృష్ణా నీరు సరఫరా చేయడంతో ట్యాంకులు నిరుపయోగమయ్యాయి. దీంతో గతంలో కొంతమంది కన్ను ఆ స్థలంపై పడింది. ఆ స్థలంలో ఉన్న వాటర్ ట్యాంకులను కూల్చివేసి ఆ స్థలానిన కబ్జా చేయడానికి ప్రయత్నించారు. దీంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ స్థలాన్ని మున్సిపల్ ఆధీనంలోకి తీసుకున్నారు.

గత కమిషనర్ ఆ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడినా.. ఎలాంటి బోర్డులు పాతకపోవడంతో మరోమారు కబ్జాదారుల కన్ను ఆ స్థలంపై పడింది. ఆ ప్రభుత్వ స్థలానికి ఆనుకుని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కార్యాలయం ఏర్పాటు చేసుకున్నాడు. ఇదే అదనుగా భావించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తనకున్న స్థలంలో గతంలో ప్రహరీని ఏర్పాటు చేసుకున్నాడు. పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించి మరో 50 గజాల స్థలాన్ని కబ్జా చేసి ప్రహరీని నిర్మిస్తున్నాడు. నేడు కొంత మంది అధికార పార్టీ బలంతో మరోమారు కబ్జాకు తెర లేపారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.



కబ్జా చేసి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రహరీని నిర్మిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి



# ప్రభుత్వ పాఠశాలలో గ్రామసభ

### అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ, జనవరి 23 : గ్రామ సభల ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం జోరుగా కనిపిస్తున్నది. గ్రామ సభలు ఏమో గాని విద్యార్థులకు ఆటంకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఇటీవల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటి కోసం దరఖాస్తులు చేసుకున్న వారితో పాటు దరాఖాస్తు చేసుకునేందుకు వీలుగా అధికారులు గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని వార్డు కార్యాలయంలో గాని, ఇతర ఖాళీ స్థలాల్లో నిర్వహించాలి. కానీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులుగా కిస్మత్‌పూర్, పిరం చెరువు, హైదర్‌షాకోట్ ప్రభుత్వ పాఠశాల ల్లోనే గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. విద్యాధికారుల అనుమతి లేకుండా, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎలాంటి సమాచారం లేకుండానే అధికారులు తమ ఇష్టారాజ్యంగా టెంట్లు వేసి గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదిరెడ్డిని వివరణ కోరగా, గురువారం నుంచి క్రీడా పోటీలను ప్రారంభించాలని అనుకున్నామని, గ్రామ సభ ఉండటంతో సాయంత్రం క్రీడాపోటీలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

### హైదర్‌షాకోట్ గ్రామ సభలో..

హైదర్‌షాకోట్‌లో జరిగిన గ్రామ సభలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత పాలనలో అవినీతి జరిగిందని చెప్పడంతో.. అక్కడే ఉన్న కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి 'ఎవరు చేశారు అవినీతి.. ఇప్పుడే బయటపెట్టాలి' అని నిలదీయడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ గొడవ రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, మేయర్ లతాప్రేమ్‌గౌడ్ సమక్షంలో జరగడం గమనార్హం.

### సమాచారం ఇవ్వకుండానే..

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా మండల విద్యాధికారితో పాటు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు అనుమతులు తీసుకోవాలి. కానీ అధికారులు తమ ఇస్టారాజ్యంగా ప్రభుత్వ పాఠశాలలో టెంటు వేసి.. మైకులు పెట్టి విద్యార్థులకు ఆటంకం కలిగిస్తున్నారు. అదికూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సభలు నిర్వహిస్తున్నారు.

- గండిపేట ఎంఈవో విజయ్‌కుమార్